# ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

నమస్తే ఎఫెక్ట్



ఆసుపత్రి పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కార్యాలయ హెచ్‌ఈవో వేణు గోపాల్

దస్తురాబాద్, ఆగస్టు 12 : 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో సోమవారం పీహెచ్‌సీకి సమస్యల రోగం అనే శీర్షికన కథనం ప్రచురితం అయింది. సోమవారం డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు కార్యాలయ హెచ్‌ఈవో వేణు గోపాల్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు, ఆసుపత్రి సిబ్బందితో కలిసి గదులు, పరిసరాలను పరిశీలించారు. రెండు రోజుల్లో పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించి ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట హెచ్‌ఈవో శైలేందర్ కన్నయ్య, సిబ్బంది రాజేందర్, రవి, భూమేశ్, గంగన్న, శివ, నర్సయ్య ఉన్నారు.

# ఓటర్ల జాబితా తయారికి శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, ఆగస్టు 12 : రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి ఎటువంటి తప్పులు లేని వార్డులవారీగా గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన శిక్షణ శిబిరానికి కలెక్టర్ రాజర్షి షా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వార్డులవారీగా గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను తయారు చేయడానికి శిక్షణ నిర్వహించారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో నిరంతర ప్రక్రియగా 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లి శానిటేషన్, ప్లాంటేషన్ కార్యక్రమాలు యథావిధిగా జరిగే విధంగా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత, డివిజనల్ పంచాయతీ అధికారి ఫణీంద్ర పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చిన జనం

### జీరో బిల్లులు రావడం లేదు..



గుడిహత్నూర్ మండలంలోని చెరువకావాయి గిరిజన గ్రామంలో గృహజ్యోతి పథకంలో భాగంగా జీరో బిల్లులు రావ డం లేదని గ్రామస్తులు కలెక్టర్‌ను వినతిపత్రం అందజేశారు. ప్రజాపాలనలో భాగంగా తాము దరఖాస్తు చేసుకున్నామని, 22 కుటుంబాలు ఉంటే కేవలం రెండు కుటుంబాలకు మాత్రమే జీరో బిల్లులు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 100 యూనిట్లు కూడా వినియోగించని తమకు ఎక్కువ బిల్లులు వస్తున్నాయని తెలిపారు. నిరుపేదలమైన తాము కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నామని, తమకు జీరో బిల్లులు వచ్చేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు.

- చెరువుకావాయి గ్రామ గిరిజనులు

# 'ప్రజావాణి'కి పోటెత్తారు

- భారీగా తరలివచ్చిన ఫిర్యాదుదారులు
- సమస్యలను పరిష్కరించాలని అర్జీల సమర్పణ
- 166 మంది దరఖాస్తులు అందజేత



కలెక్టర్ సమావేశం మందిరం ఎదుట దరఖాస్తుదారులు

ఆదిలాబాద్, ఆగస్టు 12(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్జీలు సమర్పించడానికి దరఖాస్తుదారులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జనం తమ సమస్యలను పరిష్కరించాలంటూ కలెక్టర్ రాజర్షి షాకు దరఖాస్తులు అందజేశారు. గత సోమవారం 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా ప్రజావాణి నిర్వహించలేదు. ఈ వారం జనం అధిక సంఖ్యలో హాజరయ్యారు. దీంతో ప్రజావాణి ఫిర్యాదుల విభాగం ఫిర్యాదుదారులతో కిక్కిరిసిపోయింది. దరఖాస్తులు అందజేయడానికి బారులుదీరారు. దరఖాస్తుదారుల సమస్యలను విన్న కలెక్టర్ పరిష్కారానికి వివిధ శాఖల అధికారులకు సూచనలు చేశారు. ప్రజావాణికి వివిధ సమస్యలపై 166 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

### రుణమాఫీ కాలేదు..



మా పల్లెల్లో తమ తల్లి రేమక్క పేరిట 2.27 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. తాము ఆదిలాబాద్ దక్కన్ గ్రామీణ బ్యాంకులో తీసుకున్న రూ.1.33 లక్షల రుణం మాఫీ కాలేదు. తమకు రైతుబంధు, పీఎం కిసాన్ పైసలు వస్తున్నాయి. వ్యవసాయశాఖ అధికారులను రుణమాఫీ విషయంలో అడిగితే రేషన్‌కార్డు సమస్య ఉందని అంటున్నా రు. బ్యాంకు అధికారులను సంప్రదిస్తే తాము బాకీ ఉన్న వారి వివరాలు పం పించాం. లిస్టులో పేరు వచ్చిన వారికి మాఫీ అవుతుందని చెబుతున్నారు.

- రవి, బండలనాగాపూర్, తాంసి మండలం

### విధుల్లోకి తీసుకోవాలి..



గతంలో తాము ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులుగా పనిచేశామని, తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలం టూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అమ్మ ఆదర్శ కమిటీలకు ప్రభు త్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలు అప్పగించడం వల్ల వారు తమను కాదని ఇతరులను నియమించుకున్నారని ఆవేదన చెందారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 605 మంది ఉన్నారని, రూ.2500 వేతనంతో చాలా కాలం నుంచి పనిచేసినట్లు తెలిపారు. తమ సమస్యను విన్న కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

- ప్రభుత్వ పాఠశాలల పారిశుధ్య కార్మికులు

### మున్సిపల్ దుకాణాలకు టెండర్ వేయాలి..



ఆదిలాబాద్ మున్సిపల్ కాంప్లెక్స్ పరిధిలోని దివ్యాంగులకు కేటాయించిన దుకాణా సముదాయాల కాలపరిమితి ముగిసింది. దీంతో రీ టెండర్ వేయాలని దివ్యాంగ నిరుద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని, దివ్యాంగుల సంఘ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. ప్రతి మండలంలో తమకు రుణాలు ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు.

- దివ్యాంగ నిరుద్యోగుల సంక్షేమ సంఘం

## సమస్యలను సత్వరమే పరిష్కరించాలి..

### నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



ఫిర్యాదులను సమర్పిస్తున్న అర్జీదారులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 12 : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ అభిలాష అభివన్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి హాజరై ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు తరలివచ్చి తమ ఫిర్యాదులను విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.

# మాట తప్పిన రేవంత్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

తాంసి, ఆగస్టు 12 : రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట తప్పారని రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధికార ప్రతినిధి పడాల రవీందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో అమరులైన సమగ్ర ఉద్యోగులకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే అమరులైన సమగ్ర శిక్ష ఉద్యోగులకు రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని, అలాగే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 61 ఏండ్లు నిండిన ఉద్యోగులను తొలిగించారని, వారికి వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించాలని వెల్లడించారు. సమగ్ర శిక్షలో పని చేస్తున్నటు వంటి ఉద్యోగులందరినీ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చినటువంటి హామీ మేరకు వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సమగ్ర ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర ఉద్యోగులు నాయిని పార్థసారథి, జానకొండ స్వామి, పసి రాకేశ్, ఒద్ది భోజన్న, కన్నక్ గణేశ్, నిమ్మల రాజేశ్వర్, తొగరి సురేందర్, రాగి సంజీవ్, మాడ ప్రభావతి , తదితరులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఓరియంటేషన్



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ సృజన

బాసర, ఆగస్టు 12 : బాసర ఆర్జీయూకేటీలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందిన పీయూసీ-1 విద్యార్థులకు సోమవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించినట్లు స్పెషల్ ఆఫీసర్ సృజన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు 'ధైర్యంగా అడుగేద్దాం.. ఆనందంగా చదివేద్దాం' అని అన్నారు. ఆర్జీయూకేటీ బాసర ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే విద్యా సాధమని కొనియాడారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు, ఉన్నత విద్యారంగాల్లో రాణిస్తున్నారని వివరించారు. ఇక్కడ చదువుతోపాటు మరోవైపు కళలు, సంగీతం, కూచిపూడి, యోగా రంగాల్లోనే కాకుండా క్రీడా రంగంలో కబడ్డీ, బ్యాడ్మింటన్ ఆటల్లో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. అనంతరం పలువురు అసోసియేట్ డీన్స్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్స్ డాక్టర్ పావని, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ దత్తు, మహేశ్, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ దేవరాజు, ఏ.విజయ్‌కుమార్, సురేశ్, డా.రమాదేవి, చీఫ్ వార్డెన్ శ్రీధర్, అడిషనల్ చీఫ్ వార్డెన్ అనుపమ శ్రీదేవి, డాక్టర్ సుజాత, కార్యక్రమ సమన్వయకర్త గజ్జల శ్రీనివాస్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారిపై చర్యలు తీసుకోవాలి..



వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 12 : ఆర్టీఐ యాక్టులో కోరిన సమాచారం ఇవ్వకుండా తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ మాట్లాడుతూ.. సారంగాపూర్ మండలంలో ని చించోలి(బి) సమీపంలో మున్సిపల్ ఆధ్వర్యంలో 2023న సామూహిక ప్రార్థన మైదానాన్ని ప్రారంభించారు. శిలాఫలకంలో ప్రాజె క్టు విలువ రూ. 535 లక్షలు పేర్కొన్నారు. ఈ విషయంపై తప్పుడు సమాచారం ఇచ్చారని వీరిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాబీర్, సాదిక్, జహీర్, రఫ్ పాల్గొన్నారు.

# దేశ సమైక్యతను కాపాడాలి



ర్యాలీలో పాల్గొన్న ఎంపీ నగేశ్, జిల్లా అధ్యక్షుడు, నాయకులు

### ఆదిలాబాద్ ఎంపీ నగేశ్

ఎదులాపురం, ఆగస్టు 12 : దేశ సమైక్యత, సమగ్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీ నగేశ్ అన్నారు. బీజేపీ మహిళా మోర్చ ఆధ్వర్యంలో సోమవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎంపీ ప్రారంభించగా.. విద్యార్థులు జాతీయ జెండాలను చేతపట్టి నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. జాతీయ సమైక్యతను పెంపొందించే దిశగా ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. 12 నుంచి 14వ తేదీ వరకు జాతీయ జెండాను ఇంటిపై ఎగురవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, మహిళా మోర్చా అధ్యక్షురాలు జ్యోతి, నాయకులు ఆదినాథ్, విజయ్, ఆకుల ప్రవీణ్, పద్మ, దయాకర్ పాల్గొన్నారు.

### పోస్టాఫీసు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

తపాల శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. పోస్టాఫీసు నుంచి బైక్ ర్యాలీ ప్రారంభం కాగా.. ప్రధాన విధుల గుండా ర్యాలీ కొనసాగింది. వినాయక్ చౌక్, నేతాజీ చౌక్, అంబేద్కర్ చౌక్, గాంధీ చౌక్, అశోక్ రోడ్డు నుంచి తిరిగి కార్యాలయానికి ర్యాలీ చేరుకుంది. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఎస్పీ సిద్ధార్థ, ఏఎస్పీ పుష్పేంద్ర కుమార్, పోస్టు మాస్టర్ గంగాధర్ పాల్గొన్నారు.

### దేశ ప్రజలకు లబ్ధి చేకూర్చే బడ్జెట్

గత నెల 23వ తేదీన కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశప్రజలకు లబ్ధి చేకూర్చే విధంగా ఉందని ఆదిలాబాద్ ఎంపీ జి. నగేశ్ అన్నారు. ఇటీవల జిల్లా కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు కేంద్ర బడ్జెట్‌పై ఆరోపణలు, విమర్శలు చేయడాన్ని ఖండించారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎంపీ నగేశ్ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రానికి రూ.51 వేల కోట్లు బడ్జెట్‌లో ఇవ్వనున్నారని తెలిపారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆర్థిక పద్దుల్లో చెప్పడాన్ని గుర్తు చేశారు.

# పారిశుధ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి సీతక్క

### ఇన్‌చార్జి మంత్రి సీతక్క

ఎదులాపురం, ఆగస్టు 12 : అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ, గృహనిర్మాణ శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, ఐటీడీఏ ప్రాజె క్టు అధికారి ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం' ప్రత్యేక ఐదు రోజుల కార్యక్రమంలో చేపట్టిన పారిశుధ్య పనుల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రత్యేకాధికారులుగా నియమించిన అధికారులు ప్రతి రోజు ఫీల్డ్‌కి వెళ్లాలని సూచించారు. ముఖ్యం గా తాగునీటిపై శ్రద్ధ వహించి సంపు, ట్యాంక్‌లను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. హాస్టల్స్ వార్డెన్‌లతో మీటింగ్ ఏర్పా టు చేయాలని, హాస్టల్స్‌లో స్ప్రే చేయడం, పరిసరాలు శుభ్రంగా ఉంచడం, పాములు, తేళ్లు రాకుండా చుట్టు పక్కల శుభ్రం చేయించుకోవాలని అన్నారు. వారానికి ఒకసారి శ్రమదానం చేయాలని, వంటగది శుభ్రం చేసుకోవాలని, తాగునీరు పారిశుధ్యంపై సంబంధిత ప్రత్యేకాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని, వర్షాకాలం వెళ్లే వరకు జాగ్రత్తలు పాటించాలన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సక్సెస్ చేయాలి

### కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అధికారులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 12 : ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో అధికారులు సమన్వయంతో పని చేశారని, అదే స్ఫూర్తితో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. నెలలో ప్రతి మొదటి, మూడో శనివారాలు శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించాలని, స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. నషా ముక్త భారత్ కార్యక్రమం నాలుగో సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా మాదకద్రవ్యాల రహిత సమాజానికి ప్రతి ఒక్కరు పాటు పడాలని, మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్వో భుజంగ్ రావు పాల్గొన్నారు.

### రిమ్స్ జూనియర్ వైద్యుల నిరసన




కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న రిమ్స్ జూనియర్ వైద్యులు

ఎదులాపురం, ఆగస్టు 12 : కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ సోమవారం సాయంత్రం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని రిమ్స్ జూనియర్ డాక్టర్లు నిరసన చేపట్టారు. వైద్యురాలి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కొవ్వొత్తులతో నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. మెడికల్ కాలేజ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ చౌరస్తా వరకు సాగింది.